# రూ.50 వేల 'సిప్' పెట్టుబడి.. 15 ఏళ్లలో ఎన్ని కోట్లు అవుతుంది? పూర్తి లెక్కలు ఇవే!




ప్రస్తుత రోజుల్లో మ్యూచువల్ ఫండ్స్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. మరి నెలకు రూ.50 వేల చొప్పున సిప్ పెట్టుబడి కొనసాగిస్తే 15 ఏళ్లలో చేతికి ఎంతొస్తుంది? ఎన్ని కోట్ల రూపాయల కార్పస్ అయ్యేందుకు అవకాశం ఉంది? సిప్ పెట్టుబడుల్లో రిటర్న్స్ ఎలా ఉంటాయి? అనేది ఓసారి పూర్తి లెక్కలతో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. పెట్టుబడులు పెట్టేందుకు ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్లలోకి కోట్లాది రూపాయల పెట్టుబడులు వస్తున్నాయి. గత అక్టోబర్, 2024 నెలలో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా రికార్డ్ స్థాయిలో ఏకంగా రూ.25 వేల కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఇంతలా ఈక్విటీల వైపు మదుపరులు మళ్లేందుకు ప్రధాన కారణం హైరిటర్న్స్ వస్తుండడమే. గత కొన్నేళ్లుగా చాలా రకాల ఫండ్స్ ఊహించిన దానికంటే హైరిటర్న్స్ ఇస్తున్నాయి. స్టాక్ మార్కెట్‌తో పోలిస్తే వీటిల్లో రిస్క్ తక్కువగా ఉంటుంది. ఈజీగా ఇన్వెస్ట్ చేయవచ్చు. దీంతో ఈక్విటీల్లో నేరుగా ఇన్వెస్ట్ చేయలేని వారు, హైరిటర్న్స్ కోరుకునే వారు మ్యూచువల్ ఫండ్ సిప్ ద్వారా నెల నెలా పెట్టుబడులు పెడుతున్నారు.అయిత్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు తొలినాళ్లలో పెద్దగా రిటర్న్స్ ఇచ్చినట్లు కనిపించవు. కానీ, దీర్ఘకాలంలో మాత్రం కాంపౌండింగ్ మ్యాజిక్‌తో భారీ లాభాలు ఇస్తుంటాయి. మీ పెట్టుబడిపై వచ్చే వడ్డీకి సైతం వడ్డీ ఇలా చక్రవడ్డీ జమ అవుతూ పెద్ద మొత్తంలో కార్పస్ ఏర్పడుతుంది. మీరు నెలకు రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.30 వేలు, రూ.50 వేలు అంటూ క్రమానుగత పెట్టుబడి ప్లాన్ ద్వారా ఇన్వెస్ట్ చేయగలిగితే కోట్లలో రాబడి అందుకోవచ్చు.

అయితే, అందుకు సరైన పోర్ట్‌ఫోలియో నిర్మించుకుని దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగించాల్సి ఉంటుంది. కనీసం 15 ఏళ్ల పాటు పెట్టుబడులు పెడితే కోటీశ్వరులు అయ్యేందుకు ఇక్కడ అవకాశాలు మెండుగా ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్స్ చరిత్ర గమనిస్తే గత కొద్ది కాలంగా చాలా ఫండ్స్ సగటున వార్షిక రాబడి 11 శాతం నుంచి 17 శాతం మధ్య ఉంది. ఇది భవిష్యత్తులోనూ కొనసాగుతుందని చెప్పలేం. కానీ, ఫండ్ పనితీరు బాగుంటే అంతకు మించిన రాబడి రావచ్చు కూడా.మీరు నెలకు రూ.50 వేల చొప్పున 15 సంవత్సరాల పాటు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టగలిగితే పెద్ద మొత్తంలో కార్పస్ ఏర్పాటు చేయవచ్చు. ప్రధానంగా ఇన్వెస్టర్లలో క్రమశిక్షణ, సహనం ఉండాలి. ఇక్కడ పెట్టుబడి కన్నా సమయానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎక్కువ కాలం కొనసాగగలిగితే ఎక్కువ రాబడి ఉంటుంది. ఆన్‌లైన్ గ్రో సిప్ కాలిక్యులేటర్ ద్వారా నెలకు రూ.50 వేల సిప్ పెట్టుబడి 15 ఏళ్లలో ఎంతవుతుందో తెలుసుకుందాం. మీరు ఎంచుకున్న ఫండ్ ద్వారా సగటున వార్షిక రాబడి 15 శాతంగా ఉందని అనుకుందాం. అప్పుడు 15 ఏళ్ల తర్వాత మీ కార్పస్ రూ.3.38 కోట్లు అవుతుంది. మీ పెట్టుబటి కేవలం రూ.90 లక్షలు మాత్రమే. అంటే మీకు 3.75 రెట్ల లాభాలు వచ్చినట్లవుతుంది. ఒక వేళ 12 శాతం రాబడి వచ్చింది అనుకుందాం. అప్పుడు మీ కార్పస్ రూ.2.52 కోట్లు అవుతుంది. ఇలా కూడా మీకు హైరిటర్న్స్ వచ్చినట్లే అవుతుంది.




# శాంసంగ్ ఫోన్లు వాడేవారికి గుడ్‌న్యూస్.. ఉచితంగా స్క్రీన్ రీప్లేస్‌మెంట్.. కొద్ది రోజులు మాత్రమే!

ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థ శాంసంగ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. పలు స్మార్ట్ ఫోన్లకు ఉచితంగా స్క్రీన్ రీప్లేస్‌మెంట్ చేస్తున్నట్లు తెలిపింది. ఇందుకు గతంలో ఇచ్చిన గడువు పొడిగిస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. మరి ఆ ఫోన్లు వినియోగిస్తున్న వారు ఉచితంగా ఎప్పటివరకు ఫ్రీగా స్క్రీన్ రీప్లేస్‌మెంట్ చేసుకోవచ్చు అనేది తెలుసుకుందాం.దేశీయ స్మార్ట్ ఫోన్ మార్కెట్లో ప్రముఖ కంపెనీ శాంసంగ్ మంచి వాటా కలిగి ఉంది. పెద్ద సంఖ్యలో ఈ ఫోన్లు వినియోగిస్తున్నారు. అయితే, ఇటీవల కొనుగోలు చేసిన పలు స్మార్ట్ ఫోన్లలో స్క్రీన్‌పై గ్రీన్ లైన్ వస్తుండడం కొనుగోలుదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి శాంసంగ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. గ్రీన్ లైన్ సమస్య ఎదుర్కొంటున్న వినియోగదారులకు తాజాగా శుభవార్త అందించింది. ఉచితంగానే స్క్రీన్ రీప్లేస్‌మెంట్ చేస్తామని మరోసారి తెలిపింది. గతంలో ఇచ్చిన ఉచిత గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. అంటే మరి కొన్నిరోజుల పాటు ఉచితంగా స్క్రీన్ మార్చుకునేందుకు అవకాశం లభించినట్లయింది.శాంసంగ్ కంపెనీ స్మార్ట్ ఫోన్లలో కొంత కాలంగా గ్రీన్ లైన్ సమస్య ఎదురవుతోంది. అందులో ప్రధానంగా గెలాక్సీ ఎస్21 సిరీస్, గెలాక్సీ ఎస్21 ఎఫ్ఈ, గెలాక్సీ ఎస్22 అల్ట్రా ఫోన్లలో ఈ సమస్య ఉంది. ఆయా ఫోన్లలో సాఫ్ట్ వేర్ ఇన్‌స్టాల్ చేసే క్రమంలో స్క్రీన్‌పై గ్రీన్ లైన్ కనిపిస్తోంది. స్క్రీన్‌పై ఆకుపచ్చ రంగులో ఒక గీత దర్శనమిస్తున్నట్లు చాలా మంది యూజర్లు ఫిర్యాదులు చేశారు. సోషల్ మీడియా వేదికలుగా తమ సమస్యను కంపెనీ దృష్టికి తీసుకొచ్చారు. తమ సమస్య పరిష్కరించాలని కోరారు. దీంతో భారత్‌లోని యూజర్లకు ఉచితంగా ఒక్కసారి స్క్రీన్ రీప్లేస్‌మెంట్ చేయాలని శాంసంగ్ నిర్ణయించింది. ఆ గడువు సెప్టెంబర్ 30, 2024 వరకే ఇచ్చింది. దీంతో చాలా మంది మార్చుకోలేకపోయినట్లు తెలుసుతోంది. ఇప్పుడు ఆ గడువును పొడిగించింది. తాజాగా డిసెంబర్ 31, 2024 వరకు గడవు ఇస్తున్నట్లు తెలిపింది.తమ స్మార్ట్ ఫోన్లలో గ్రీన్ లైన్ సమస్య ఎదుర్కొంటూ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా స్క్రీన్ రీప్లేస్‌మెంటే చేసుకోని యూజర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. వారంతా తమ దగ్గర్లోని శాంసంగ్ సర్వీస్ కేంద్రానికి వెళ్లి ఉచిత సేవను పొందవచ్చని శాంసంగ్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే చాలా మంది తమ స్క్రీన్ రీప్లేస్ చేసుకున్నట్లు కంపెనీ తెలిపింది. మరోవైపు.. గంతలో ప్రముఖ స్మార్ట్ ఫోన్ కంపెనీ వన్ ప్లస్ సైతం ఇలాంటి సమస్యే ఎదుర్కొంది. దీంతో ఉచిత స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు శాంసంగ్ సైతం అలాంటి అవకాశం కల్పించడంతో యూజర్లు ఊపిరి పీల్చుకున్నారు.

# యూపీఐ పేమెంట్లు ఎక్కువగా చేస్తున్నారా? ఈ లిమిట్ దాటితే ఐటీ నోటీసులొస్తాయ్.. చూసుకోండి!





మీరు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారా ? యూపీఐ ద్వారానే డబ్బులు పంపించడం లేదా రిసీవ్ చేసుకోవడం చేస్తున్నారా? అయితే మీకో బిగ్ అలర్ట్. మీ అకౌంట్లో లిమిట్ దాటినట్లయితే మీకు ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మీ ట్రాన్సాక్షన్లపై ఆదాయపు పన్ను శాఖ నిఘా ఉంటుంది. ఆ వివరాలు ఇప్పుడే తెలుసుకోండి మరి.ప్రస్తుత రోజుల్లో బ్యాంకుకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకోవడం, జమ చేయడం, ఇతరులకు ట్రాన్స్‌ఫర్ చేయడం వంటివి చేయాల్సిన అవసరం లేదు. అంతా అర చేతిలోనే జరిగిపోతోంది. డిజిటల్ పేమెంట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చాక ఆన్‌లైన్ చెల్లింపులు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌పేస్ యాప్స్ వినియోగం భారీగా పెరిగింది. దేశంలో జరుగుతున్న డిజిటల్ పేమెంట్లలో యూపీఐ పేమెంట్లు అధికంగా ఉంటున్నాయి. కిరాణ సామగ్రి నుంచి పెద్ద పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువల కొనుగోలు వరకు రూ.10 నుంచి వేలల్లో యూపీఐ ద్వారానే పేమెంట్లు చేస్తున్నారు. కొందరు రెండు, మూడు ఆపైన యూపీఐ యాప్స్ వినియోగిస్తుంటారు. రోజులో పదుల సంఖ్యలో లావాదేవీలు నిర్వహిస్తుంటారు. తమకు ఎవరైనా డబ్బులు ఇవ్వాల్సి ఉంటే యూపీఐ చేయమంటారు.ఇలా మీరు కూడా యూపీఐ యాప్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారా? యూపీఐ పేమెంట్లు చేయడం, యూపీఐ ద్వారా డబ్బులు తీసుకోవడం చేస్తున్నారా? అయితే మీకో అలర్ట్. ఇష్టం వచ్చినట్లు లావాదేవీలు నిర్వహిస్తే చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది. ఎక్కువ మొత్తంలో యూపీఐ చేసే ట్రాన్సాక్షన్లపై ఆదాయపు పన్ను విభాగం నిఘా ఉంటుంది. మీ బ్యాంకు ఖాతాలో పరిమితికి మించి నగదు జమ అవడం, విత్ డ్రా చేసుకున్నా మీపై ఐటీ నిఘా ఉంటుంది. దీంతో మీకు ఇన్‌కమ్ ట్యాక్స్ నోట్సీలు రావచ్చు. దీంతో మీరు పన్నులు, పెనాల్టీలు చెల్లించాల్సి వస్తుంది.ఏఐ టెక్నాలజీ ద్వారా రోజు వారీ ట్రాన్సాక్షన్లపై ఆదాయపు పన్ను శాఖ నిఘా పెడుతుంది. పరిమితికి మించి ట్రాన్సాక్షన్లు చేస్తూ ఆదాయపు పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ ప్రకారం.. ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ పొదుపు ఖాతాల్లో రూ.10 లక్షల పరిమితి ఉంటుంది. ఈ లిమిట్ దాటి సేవింగ్స్ ఖాతాలో డబ్బులు జమ అయినట్లయితే ఆ వివరాలు ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగానికి వెళ్తాయి. నేరుగా బ్యాంకులో మీ వివరాలు తెలియజేస్తాయి. ఈ లిమిట్ చూసుకోకుండా బ్యాంకులో డబ్బులు జమ చేస్తూ యూపీఐ పేమెంట్లు చేసుకుంటూ వెళ్తే నోటీసులు అందుకోవాల్సి వస్తుంది.ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 285 బీఏ కింద బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పరిమితి ఉంటుంది. అలాగే ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేసే సమయంలో సేవింగ్స్ ఖాతాలో జమ అయిన డబ్బుల వివరాలు సరిపోలకపోతే మీకు ఐటీ శాఖ నోటీసులు జారీ చేస్తుంది. అలాగే రూ.50 వేలు అంతకు మించి ట్రాన్సాక్షన్ చేసినప్పు పాన్ కార్డు ఇవ్వాల్సి ఉంటుంది. అంటే ఐటీ శాఖ నిఘా పరిధిలోకి వెళ్లినట్లే. ఈ వివరాలన్ని గమనిస్తూ యూపీఐ ట్రాన్సాక్షన్లు చేయడం మంచిది.



# హోం లోన్ కోసం ట్రై చేస్తున్నారా? ఫాస్ట్‌గా మంజూరు కావాలంటే ఇలా చేయాల్సిందే?

ఇల్లు కట్టుకునేందుకు లేదా కొనుగోలు చేసేందుకు చాలా మంది హోం లోన్లపైనే ఆధారపడుతున్నారని చెప్పొచ్చు. ఇది అందరికీ రాకపోవచ్చు. మంచి క్రెడిట్ హిస్టరీ ఉండాలి. ఇంకా కొన్ని అర్హతలు ఉండాలి. మనకు అవసరమైనంత త్వరగా కూడా రాకపోవచ్చు. అందుకే.. హెూమ్ లోన్ త్వరగా రావాలంటే కొన్ని పద్ధతులు ఉన్నాయి. ఇలా ట్రై చేస్తే గృహ రుణం త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంటుంది.చాలా మంది ఇంటి కొనుగోలుకు బ్యాంక్ లోన్ కోసం చూస్తారు. ఇక్కడ ప్రాసెస్ ఎక్కువగా ఉంటుంది. పలు రకాల ఛార్జీలు ఉంటాయి. వడ్డీ రేట్లు ఎక్కువే ఉంటాయి. ఇవి బ్యాంకుల్ని బట్టి మారుతుంటాయి. ఇక ఈ హెూం లోన్ వేగంగా మంజూరయ్యేందుకు దరఖాస్తు దారులు కొన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఏ బ్యాంక్ అయినా లోన్ మంజూరు చేసే ముందుగా చూసేది సిబిల్ స్కోరునే. సాధారణంగా క్రెడిట్ స్కోరు 750 కంటే ఎక్కువ ఉంటే.. అప్పుడు లోన్ త్వరగా రావడమే కాకుండా.. వడ్డీ రేట్లు కూడా ఇక్కడ తక్కువగా ఉండొచ్చు. అందుకే హెూం లోన్ కోసం ప్రయత్నించే వారు కచ్చితంగా ఏడాది ముందు నుంచే ఈ సిబిల్ స్కోరును పెంచుకునేందుకు ప్రయత్నించాలి. లోన్లపై సకాలంలో ఈఎంఐ చెల్లిస్తుంటే గనుక అప్పుడు క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉంటుంది. ఇంకా హెూం లోన్ ఇండివిడ్యువల్‌గా కాకుండా.. జాయింట్‌గా (ఇంట్లో సంపాదిస్తున్న జీవిత భాగస్వామి లేదా ఇతర కుటుంబ సభ్యులు) కలిసి దరఖాస్తు చేయడం వల్ల లోన్ వేగంగా, ఇంకా ఎక్కువగా కూడా పొందే అవకాశం ఉంటుంది. రెండు ఆదాయాలు ఉన్నందుకు.. లోన్ రీపేమెంట్స్ కూడా డీఫాల్ట్ లేకుండా ఉంటాయన్న ఉద్దేశంతో బ్యాంకులు ఉమ్మడి గృహ రుణాల్ని వేగంగా ఆమోదిస్తాయి.మరోవైపు బ్యాంకులు.. పేరున్న విశ్వసనీయ ప్రాపర్టీ డెవలపర్ల ప్రాజెక్టులపై ఆసక్తి చూపుతాయి. వీరి ప్రాజెక్ట్స్ సకాలంలో ఎలాంటి చట్టపర చిక్కులు లేకుండానే పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ఇంకా చాలా బ్యాంకులు ప్రముఖ ప్రాపర్టీ డెవలపర్స్‌తో టై-అప్ అవుతాయి. అందుకే.. బ్యాంక్ ఆమోదించిన డెవలపర్‌ను ఎంచుకుంటే ఇంకా లోన్ త్వరగానే పొందొచ్చు.సాధారణంగా బ్యాంకులు ఇంటి విలువపై 80 నుంచి 90 శాతం వరకు లోన్ ఇస్తాయి. మిగతా 10-20 శాతం మొత్తాన్ని డౌన్ పేమెంట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు దరఖాస్తు దారుడు అవసరమైన దాని కంటే ఎక్కువ డౌన్ పేమెంట్ చెల్లించడం వల్ల బ్యాంక్ నమ్మకం ఉంచుతుంది. ఇలాంటి సమయాల్లో కూడా లోన్ వేగంగా పొందే అవకాశాలు ఉంటాయి. ఇంకా మీ శాలరీ అకౌంట్ ఉన్న బ్యాంకును లేదా ఇప్పటికే లోన్లు తీసుకొని సకాలంలో తీర్చేసిన బ్యాంకును ఎంచుకుంటే ఇంకా మంచిది. ఇప్పటికే మీ ఆర్థిక చరిత్ర ఆ బ్యాంకుకు తెలిసుంటుంది కాబట్టి ప్రాసెస్ ఈజీగా జరుగుతుంది. లోన్లు తీసుకునే ముందు.. ఎలాంటి ఛార్జీల్ని వసూలు చేస్తున్నాయి.. ఇంకా ఏ బ్యాంకులో వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి వంటి విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ పెన్షన్ సిస్టమ్ పథకంలో భాగమైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ 2 ఫామ్స్ కచ్చితంగా సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇటీవలే కొత్త నిబంధనలు విడుదల చేసింది పెన్షన్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్ విభాగం. ఫామ్స్ ఇవ్వడంలో విఫలమైనట్లయితే మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎన్‌పీఎస్ బెనిఫిట్స్ అందుకుడా పోతాయి. ఆ వివరాలు ఇప్పుడే తెలుసుకుందాం. కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో భాగమైన వారందరికీ అలర్ట్. ఎన్‌పీఎస్ పథకానికి సంబంధించి కేంద్రం కొత్త రూల్స్ తీసుకొచ్చింది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (ఎన్‌పీఎస్ అమలు) రూల్స్ 2021 పరిధిలోని రూల్ 10 కచ్చితంగా పాటించాలని




# కేంద్రం స్కీమ్ ఎన్‌పీఎస్ కొత్త రూల్స్.. వెంటనే ఈ 2 ఫామ్స్ సబ్మిట్ చేయండి.

సెంట్రల్ గవర్నమెంట్ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది పెన్షన్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్ విభాగం. ఈ ఆదేశాల ప్రకారం నేషనల్ పెన్షన్ సిస్టమ్ పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్క కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి ఎన్‌పీఎస్ స్కీమ్ లేదా పాత పెన్షన్ స్కీమ్ బెనిఫిట్స్ పొందాలంటే సూచించిన పనులను వెంటనే పూర్తి చేయాల్సి ఉంటుంది. పెన్షన్ స్కీమ్ పరిధిలోకి వచ్చే ప్రతి ఉద్యోగి రెండు ఫామ్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుందని డీఓపీపీడబ్ల్యూ స్పష్టం చేసింది. వాటి గురించి తెలుసుకుందాం.ఈ మేరకు అక్టోబర్ 25, 2024 రోజునే ఆఫీస్ మెమోరండం జారీ చేసింది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ 2021 లోని రూల్ 10 ప్రకారం.. ఎన్‌పీఎస్ పథకంలోకి వచ్చే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధుల్లో చేరే సమయంలోనే తమకు పెన్షన్ ఏ విధంగా రావాలనేదానిపై ఆప్షన్ ఎంచుకోవాలి. ఎన్‌పీఎస్ స్కీమ్ లేదా సెంట్రల్ సివిల్ సర్వీస్ పెన్షన్ రూల్స్ లేదా సెంట్రల్ సివిల్ సర్వీస్ ఎక్స్‌ట్రార్డినరీ పెన్షన్ రూల్స్ కింద పెన్షన్ అందుకునేందుకు ఫామ్-1 సబ్మిట్ చేయాలి. విధుల్లో చేరే సమయంలోనే ఫామ్ 1 సబ్మిట్ చేయడం ద్వారా సర్వీసులో ఉండగ మరణించినా, రిటైర్మెంట్ సమయంలో రావాల్సిన బెనిఫిట్స్, పెన్షన్ వస్తుందని పేర్కొంది.మరోవైపు.. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారైనా లేదా ఇప్పటికే చాలా కాలంగా విధులు నిర్వర్తిస్తున్న వారైనా నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో ఉన్నట్లయితే వారు సైతం ఫామ్ 1 సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ విధుల్లో చేసేటప్పుడు పెన్షన్ బెనిఫిట్స్ ఆప్షన్ ఎంచుకునేందుకు ఈ ఫామ్ 1 అవకాశం కల్పిస్తుంది. దీంతో పాటు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల వివరాలు సైతం వేరే ఫామ్ ద్వారా సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అందుకు వారు ఫామ్ - 2ను ఎంచుకోవాలి. ఫామ్- 1తో పాటు కుటుంబ సభ్యుల పేర్లతో ఫామ్- 2 హెడ్ ఆఫీసులో అందించాల్సి ఉంటుంది. ఫామ్- 1 అనేది పెన్షన్‌కు సంబంధించి ఆప్షన్ ఎంచుకునే ఫామ్.

# ఎస్‌బీఐ నుంచి మరో కొత్త స్కీమ్.. రూ.25 లక్షల బెనిఫిట్.. మీ డబ్బులూ తిరిగిచ్చేస్తారు!

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ ఎస్‌బీఐ లైఫ్ సరికొత్త టర్మ్ ప్లాన్ తీసుకొచ్చింది. ఆరోగ్య పరీక్షలు అవసరం లేకుండానే, స్వీయ ధ్రువీకరణతో ఈ టర్మ్ లైఫ్ ప్లాన్ తీసుకోవచ్చని తెలిపింది. అదే ఎస్‌బీఐ లైఫ్ స్మార్ట్ స్వధన్ నియో పాలసీ. ఇందులో గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు బీమా కవరేజీ కల్పిస్తోంది. అంతే కాదు మీరు చెల్లించిన ప్రీమియం మొత్తం తిరిగి చెల్లిస్తోంది. ఆ వివరాలు తెలుసుకుందాం. ప్రస్తుత రోజుల్లో లైఫ్ ఇన్సూరెన్స్ అనేది తప్పనిసరి. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు పాలసీదారుడి కుటుంబానికి అండగా నిలుస్తుంది. అయితే, పొదుపుతో కూడిన పాలసీలు పెద్ద మొత్తంలో కవరేజీ అందించవు. కానీ, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు పెద్ద మొత్తంలో బీమా రక్షణ ఇస్తాయి. అయితే, చెల్లించిన ప్రీమియం అనేది వెనక్కి తిరిగి రాదు. దీంతో చాలా మంది టర్మ్ ప్లాన్లు తీసుకునేందుకు వెనకడుగు వేస్తుంటారు. అలాంటి వారందరికీ ఎస్‌బీఐ లైఫ్ శుభవార్త అందించింది. పెద్ద మొత్తంలో బీమా కవరేజీ ఇస్తూనే, చివరకు ప్రీమియం సైతం పూర్తిగా వెనక్కి ఇచ్చే సరికొత్త బీమా పాలసీ టర్మ్ ప్లాన్ తీసుకొచ్చింది. అదే ఎస్‌బీఐ లైఫ్ స్మార్ట్ స్వధన్ నియో పాలసీ.ఎలాంటి ఆరోగ్య పరీక్షలు అవసరం లేకుండానే ఈ పాలసీ కొనుగోలు చేయవచ్చు. అలాగే ఆదాయానికి సంబంధించిన స్వీయ ధ్రువీకరణతో ఈ ప్లాన్ కొనుగోలు చేసే ఈ కొత్త పాలసీని ఆవిష్కరించింది. 18 ఏళ్ల వయసు నుంచి 60 ఏళ్ల వయసు లోపు వ్యక్తులు ఎవరైనా ఈ స్మార్ట్ స్వధన్ నియో పాలసీని కొనుగోలు చేయవచ్చు. ఈ పాలసీలో కనీస బీమా రక్షణ రూ.5 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.24.9 లక్షల వరకు ఇస్తున్నట్లు ఎస్‌బీఐ లైఫ్ తెలిపింది. ఈ టర్మ్ ప్లాన్ కొనుగోలు చేసేందుకు కనీస ప్రీమియం రూ.5 వేలుగా ఉంది. ఈ టర్మ్ ప్లాన్ 15 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వరకు ఎంచుకోవచ్చు. ప్రీమియం విడతల వారీగా కాకుండా ఒకేసారి చెల్లించే వీలు కల్పిస్తోంది.పాలసీ మెచ్యూరిటీ సమయం ముగిసిన తర్వాత పాలసీదారుడికి నిబంధనల మేరకు 100 శాతం ప్రీమియం వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. అయితే, పాలసీ వ్యవధి ఉన్న సమయంలోనే పాలసీ తీసుకున్న వ్యక్తి మరణించినట్లయితే బీమా విలువ మేరకు పరిహారం లభిస్తుంది. రూ.25 లక్షల కోసం పాలసీ కొనుగోలు చేస్తే ఆ డబ్బులు మొత్తం పాలసీదారుడి కుటుంబానికి చేరతాయి. అంటే తమ ప్రీమియాన్ని బట్టి బీమా రక్షణ ఆధారపడి ఉంటుంది. ఇక రెండేళ్ల పాటు ప్రీమియం చెల్లించిన తర్వాత పాలసీ స్వాధీనం చేసుకున్నట్లయితే హామీ ఇచ్చిన స్వాధీన విలువను కంపెనీ తిరిగి చెల్లిస్తుంది.మరోవైపు.. స్మార్ట్ స్వధన్ నియో టర్మ్ ప్లాన్ అందించే బీమా మొత్తం సరిపోదని అనుకునే వారు ఇతర రైడర్లను కొనుగోలు చేయవచ్చు. యాక్సిడెంటల్ బెనిపిట్ రైడర్‌ను ఈ పాలసీకి జోడించుకోవచ్చు. ఇది కనీసం రూ.50 వేల నుంచి రూ.74 లక్షల 70 వేల వరకు ఉన్నట్లు ఎస్‌బీఐ లైఫ్ తెలిపింది. స్వాధీన విలువలో 50 శాతం వరకూ లోన్ సైతం పొందేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపింది. అంటే బీమా కవరేజీతో పాటు ప్రీమియం వెనక్కి ఇచ్చేస్తారు.




Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com